# సర్వధారి!

క. సర్వము భరించు కాలము
పర్వున నొక గంతువోలె వచ్చితివమ్మా,
పర్వదిన మ్మిది యన్నటు
గర్వింతుము సర్వధారి, కౌశల్య ఝురీ. (1)

క. అలసట లేని నిరంతర
చలనములో మమ్ము జూడ చనుదెంచితె మా
స్థలమున కవ్యాజ కృపా
కలిత ముఖ జ్యోత్స్న బజిమ కళ్యాణధునీ. (2)

క. అరువది యేండ్లాయెను మా
యిరవున కీ వరుగుదెంచి, యే యే మార్పుల్,
దొరలెడు నూర్పులు కనెదవో,
సరిదిద్దం  గలవె, తగిన శక్తి కలుగుచో. (3)

క. రంగులు పూసిన మొగముల
శృంగారము తోడ గంతులెత్తెడి ప్రజలో
పొంగెడు ధార్మికవర్తన
లం గల నిక్కంపు టూర్ములన్  పేర్చగదే (4)

క. కోయిలలు క్రొత్త చివురుల
యూయెల వంపులకు మురిసి, యుజ్జ్వల ఫణితిన్
శ్రేయోలాప స్వాగత
మీయ దొడంగినవినీకు నిట నట గనుమా. (5)

క. చిక్కిన రూకల గల గల
దక్కి యొకరొ యిర్వురో ముదమ్మున పొంగన్,
చిక్కిన డొక్కల సలసల
నక్కిలి పడు పదుల జూడవా కన్నీటన్? (6)

క. అంతము లేని ప్రపంచ
క్రాంతికి సాక్ష్యమ్ము  వీవు, శాశ్వత పూర్ణ
స్వాంత నిధానము, పేర్చుము
క్షాంతి ద్యుతి, సర్వధారి, జనముల యెదలన్. (7)

1. పర్వ : పండుగు; ఝురి : సెలయేరు

2. అవ్యాజ : కపటములేని; కల్యాణధుని : శుభము నది;
జ్యోత్స్న : వెన్నెల.

3. ఇరవు : స్థానము.

4. ఊర్మ్ములు : పరంపరలు, ప్రవాహములు.

5. ఫణితిన్ : వాక్కుతో; శ్రేయ : శుభము.

6. అక్కిలిపడు : కలతపడు.

7. క్రాంతి : క్రమణము; పూర్ణ : శక్తిగల; నిధానము : పాత్రము;

క్షాంతి : క్షమ, ఓర్పు; ద్యుతి : వెలుగు.

-- **వేమూరి వేంకట రామనాథం**